RNI NO. TELTEL 2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ఎటిటర్ జి. శ్రీనివాస్ సంపుటి 03 సంచిక 498 సోమవారం 21 జులై 2025 పేజీలు:4 వెల 2/-

Simultaneoulsy Published from Andhra Pradesh &Telangana

## తప్పిన పెను ప్రమాదం

శంషాబాద్-తిరుపతి స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం

సమస్యను ముందే గుర్తించిన పైలెట్లు

ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు




ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు విమాన ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడేలా చేస్తున్నాయి. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ఘటన మరువక ముందే పలు విమానాలు సాంకేతిక సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవుతున్నాయి. తాజాగా శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ ఎస్‌జీ-2138 విమానంలో టెక్నికల్ ఇష్యూస్‌తో నిలిచిపోయింది.




# రంగం సిద్ధం

స్థానిక ఎన్నికల నిరీక్షణకు తెర

ఎన్నికల వేడిలో రాజకీయ పార్టీలు

జెడ్పీ, ఎంపీపీ స్థానాలపై స్పష్టత,

బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ!

ఆర్డినెన్స్ చుట్టూ న్యాయ సవాళ్లు?

### పల్లెలో పొలిటికల్ హీట్

అధికార కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక అవకాశంగా చూస్తోంది. ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నియోజకవర్గాల్లో పావులు కదుపుతూ, 'హస్తం' జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. మరోవైపు, అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకొని స్థానిక పోరులో సత్తా చాటాలని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ఆశావాహులు ఇప్పటికే 'గ్రౌండ్ ప్రిపేర్' చేసుకుంటూ, రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రాగానే మరింత దూకుడుగా ప్రచారానికి దిగడానికి సిద్ధంగా ఉన్నారు. ఈసీ నుంచి షెడ్యూల్ వెలువడితే, పల్లెల్లో పొలిటికల్ హీట్ మరింత తీవ్రం కావడం ఖాయం

హైదరాబాద్, జులై 20,: తెలంగాణ రాష్ట్రంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ , మండల పరిషత్ , గ్రామ పంచాయతీ స్థానాలపై తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేస్తూ బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని ఆదేశించగా, ఎన్నికల సంఘం సైతం షెడ్యూల్ విడుదలకు సన్నద్ధమవుతోంది.

**స్థానాల ఖరారు: ఒక చూపులో గణాంకాలు**

రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం, ప్రభుత్వం వివిధ విభాగాల్లోని స్థానాలను ఖరారు చేసింది. ఈ వివరాలను అధికారికంగా ప్రకటించింది:

జిల్లా పరిషత్‌లు (జడ్పీలు): 31

మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు): 566

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీలు): 566

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీలు): 5,773

గ్రామ పంచాయతీలు: 12,778 , వార్డులు: 1.12 లక్షలు

ఈ స్థానాల వివరాలతో కూడిన ప్రకటన,

మిగతా 2లో

## దేశానికి బిగ్ బాస్ కాదు... బిగ్ బ్రదర్ కావాలి

రాజకీయ వేదికపై దక్షిణాది ఆత్మగౌరవ నినాదం

హిందీ బలవంతంగా రుద్దకం,

డీలిమిటేషన్ పై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ నేత

కశ్మీర్ నుండి వలస కార్మికుల వరకు

ప్రధాని మోడీ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు



జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఓ జర్నలిజం టాక్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గళం విప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'బిగ్‌బాస్'లా కాకుండా 'బిగ్ బ్రదర్'లా వ్యవహరించాలని, చిన్న రాష్ట్రాలపై, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించకూడదని ఆయన సూటిగా డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ మారియాతో దాదాపు అర్ధగంట పాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు.

**డీలిమిటేషన్: దక్షిణాదికి అన్యాయమా?** కేటీఆర్ ప్రసంగంలో ప్రధానంగా వినిపించిన అంశం పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కేంద్రం ఆదేశాల మేరకు ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించాయి. కానీ, దాన్ని పాటించని ఉత్తరాది రాష్ట్రాలు ఇప్పుడు జనాభా పరంగా బాగా పెరిగాయి. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే, ఉత్తరాది రాష్ట్రాల ఆజమాయిషి పెరిగి, దేశం మొత్తం 'హిందీ బెల్ట్' లీడ్

## బోనాల గిఫ్ట్

గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా

బోనాల సందర్భంగా రూ.కోటి పురస్కారం ప్రకటించిన ప్రభుత్వం




ప్రముఖ తెలుగు సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.కోటి ప్రోత్సాహం అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం పాతబస్తీ బోనాల సందర్భంగా తాజాగా రూ.కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటించారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే




రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఆగస్టు 3న రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం

జిల్లా, మండల, రాష్ట్రస్థాయి నాయకులుహాజరు కావాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు, కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో భవిష్యత్తు కార్యాచరణ చర్చించడానికి ఆగస్టు 3న రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు.

## భవిష్యత్తుకు బాటలు

ఘట్‌కేసర్-యాదాద్రి

ఎంఎంటీఎస్ విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఆర్థిక శక్తికి రైల్వే స్పీడ్

ప్రజా వాణికి దక్కిన విజయం




హైదరాబాద్ జులై 20: తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం ఓ చరిత్ర సృష్టించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలోమీటర్ల మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ ఎంఎంటీఎస్ విస్తరణకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలక ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించేందుకు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 100 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది. ఈ నిర్ణయం తెలంగాణ ప్రయాణికుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చడమే కాదు, రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుంది.

**ఒక ప్రాజెక్టు, అనేక ప్రయోజనాలు:**

ఈ ఎంఎంటీఎస్ విస్తరణ ప్రాజెక్టు కేవలం రైలు మార్గం కాదు, ఇది తెలంగాణ ఆర్థిక రంగానికి, పర్యాటక రంగానికి ఊపిరి పోయనుంది. 33 కిలోమీటర్ల ఈ మార్గం రూ. 464 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడుతుంది. వాస్తవానికి, 2016-17లో రూ. 330 కోట్లతో దీనిని ప్రతిపాదించినా, ఇప్పుడు కేంద్రమే పూర్తిస్థాయిలో ఈ ప్రాజెక్టును చేపడుతోంది. కేవలం రెండేళ్లలోపు పనులు పూర్తి చేయాలన్నది అధికారుల లక్ష్యం.

**ఎలా ప్రయోజనం చేకూరుతుంది?**

భక్తులకు వరం: లక్షలాది మంది

మిగతా 2లో

## రణరంగానికి సిద్ధం

ట్రంప్ పేల్చిన బాంబు, బిహార్ కుంభకోణంపై ప్రతిపక్షాల పదునైన అస్త్రాలు!

వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్రాన్ని చుట్టుముట్టిన ప్రతిపక్షాలు

ప్రధాని మోదీ ప్రకటనకు పట్టు కీలక బిల్లుల ఆమోదమే పాలక పక్షం ఎజెండా



## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే:

ముషీరాబాద్, జూలై 20: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు, కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో భవిష్యత్తు కార్యాచరణ చర్చించడానికి ఆగస్టు 3న రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా, మండల, రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అమలుకు తీసుకోవలసిన కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన, చట్టపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల జీవో తీయకుండా కోర్టు కొట్టి వేస్తుందని ఊహాగానాలతో పెండింగ్‌లో పెట్టరాని స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చని ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తాయని భావించినా.. సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లినాసరే బీసీలే కేసులు గెలిచే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

## భవిష్యత్తుకు బాటలు

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి భక్తులకు సులభమైన, వేగవంతమైన ప్రయాణం. **నగరానికి అనుసంధానం:** యాదాద్రి, జనగామ జిల్లాల ప్రజలు హైదరాబాద్‌కు సులువుగా చేరుకోగలరు. **రోడ్డు ట్రాఫిక్ తగ్గింపు:** రోడ్డు రవాణాపై ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుంది. ఉపాధి అవకాశాలు: సమీప గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది, స్థానికులకు ఉపాధి కల్పిస్తుంది.

**పర్యాటక అభివృద్ధి:** రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుంది. పార్లమెంట్‌లో గళం, వాస్తవంలో ఫలితంభువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభించడంపై కేంద్ర రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది భువనగిరి ప్రజల భవిష్యత్తుకు సరికొత్త బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రజల నుంచి ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. గత ఏప్రిల్ నెలలో కూడా కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులోని జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు, దీని ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అప్పట్లో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం, ఇప్పుడు నిధులతో సహా ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

**టికెట్ కేవలం రూ. 20: హైదరాబాద్-యాదాద్రి ప్రయాణంలో విప్లవం**

ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి యాదాద్రికి ప్రయాణం అనూహ్యంగా సులభతరం అవుతుంది. అధికారులు అంచనా వేసిన ప్రకారం, కేవలం రూ. 20 టికెట్‌తో సుమారు గంటలోపే యాదాద్రి ఆలయానికి చేరుకునే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మౌలాలి నుంచి ఘట్‌కేసర్ వరకు 21 కిలోమీటర్ల మేర రెండు ఎంఎంటీఎస్ లైన్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు మరో 33 కిలోమీటర్ల కొత్త లైను నిర్మాణంతో యాదాద్రికి పూర్తిస్థాయి రైల్వే కనెక్టివిటీ లభించనుంది. ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయడంతో పాటు, భూసేకరణ, ఇతర ముందస్తు పనులను వేగవంతం చేయడానికి కేంద్రం మార్గం సుగమం చేసింది. భవిష్యత్తులో జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు మరోసారి కేంద్రంతో చర్చిస్తానని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ ఎంఎంటీఎస్ విస్తరణ ప్రాజెక్టు తెలంగాణ రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే కాకుండా, సామాన్య ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తుంది

## రంగం సిద్ధం

రాబోయే ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు కీలక పరిణామంగా మారింది.

**బీసీ రిజర్వేషన్ల వివాదం:** రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఈ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను పెంచాలని ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ దిశగా ఇప్పటికే బీసీ కులగణన చేపట్టి, డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే.తాజాగా, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, దీనికి శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేయాల్సిన అవసరం ఉంది. గవర్నర్ గురువారం శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో, ఆర్డినెన్స్ త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.అయితే, ఈ ఆర్డినెన్స్ న్యాయస్థానాల్లో నిలబడుతుందా? అన్న అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు అనే నిబంధన స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చే ఆర్డినెన్స్ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవచ్చని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి, పార్లమెంటు ఆమోదం పొందితేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యమని మరికొందరు వాదిస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీలో చేసిన తీర్మానం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా, అదే బిల్లుకు సంబంధించి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చా అన్న అంశం కూడా న్యాయపరమైన పరిశీలనకు దారితీయవచ్చు.ప్రస్తుతం రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలు, 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, 585 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆర్డినెన్స్ జారీ అయిన తర్వాత ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగియగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం 2024 జూన్‌లో పూర్తయ్యింది. అప్పటి నుండి ఈ స్థానాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సార్వత్రిక ఎన్నికలు, కులగణన కార్యక్రమాల కారణంగా స్థానిక ఎన్నికలు ఆలస్యమయ్యాయి.సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ చట్టపరమైన ఇబ్బందులు సృష్టిస్తే ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో అన్నది రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# రణరంగానికి రంగం సిద్ధం

ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ, కేంద్ర ప్రభుత్వం ఆదివారం (జులై 20, 2025) నిర్వహించిన అఖిలపక్ష సమావేశం తీవ్ర వాదోపవాదాలకు వేదికైంది. బిహార్‌లోని ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో కొనసాగుతున్న "పోల్ స్కామ్", కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి, అత్యంత సంచలనం సృష్టించిన భారత్-పాక్ కాల్పుల విరమణపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వంటి పలు కీలక అంశాలపై ప్రతిపక్షాలు కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి.

**ప్రతిపక్షాల వ్యూహం: మోదీ సర్కార్‌ను ఇరుకున పెట్టే అస్త్రాలు**

కేంద్ర మంత్రి, రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఆప్ సహా పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సభ సజావుగా సాగేందుకు కేంద్రం విజ్ఞప్తి చేసినా, ప్రతిపక్షాలు తమ కార్యాచరణను స్పష్టంగా ప్రకటించాయి:

**బిహార్ ఓటర్ల జాబితా స్కాం:** ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల పునర్విశ్లేషణ ప్రక్రియలోని "పోల్ స్కామ్"ను తీవ్రంగా ప్రస్తావించి, ఇది ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదమని హెచ్చరించారు.

**పహల్గాం ఉగ్రదాడి:** ఇటీవల కశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో, భవిష్యత్తు ప్రణాళికలేమిటో స్పష్టం చేయాలని కాంగ్రెస్ పట్టుబట్టింది.

**ట్రంప్ కాల్పుల విరమణ వ్యాఖ్యలు:** భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను దెబ్బతీశాయని, దీనిపై కేంద్రం పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని సంజయ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రధాని మోదీ స్వయంగా పార్లమెంటులో ప్రకటన ఇవ్వాలని గౌరవ్ గొగోయ్ స్పష్టం చేశారు.

**'ఇండియా' కూటమి ఎజెండా:** అసెంబ్లీ ఎన్నికల్లో విడిపోనున్న ఆప్ అఖిలపక్ష సమావేశం అనంతరం ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ, "ఇండియా" కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికలకు మాత్రమేనని, ఆప్ సొంతంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ప్రతిపక్షాల మధ్య ఐక్యతపై భిన్నాభిప్రాయాలకు తావిచ్చే అంశంగా మారింది.

**ఝార్ఖండ్‌పై 'సవతి తల్లి ప్రేమ': కేంద్రంపై జేఎంఎం తీవ్ర ఆరోపణలు**

ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎంపీ మహువా మాజీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఝార్ఖండ్ పట్ల కేంద్రం "సవతి తల్లి ప్రేమ" చూపుతోందని ఆరోపించారు. ఖనిజాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, దేశంలోని అత్యంత పేద రాష్ట్రాలలో ఒకటిగా ఉండటానికి కేంద్రం వివక్షాపూరిత విధానాలే కారణమని ఆమె విమర్శించారు. రైతులు, మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకాల అమలుకు కేంద్రం అండగా ఉండాలని మహువా మాజీ డిమాండ్ చేశారు.

**వర్షాకాల సమావేశాల ఎజెండా: కీలక బిల్లులు, రాజకీయ యుద్ధం**

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక పరిణామాల తర్వాత తొలిసారిగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేంద్ర సర్కార్‌ను ప్రతిపక్షాలు పలు అంశాలపై నిలదీసే అవకాశం ఉంది.గత బడ్జెట్ సమావేశాల్లో (జనవరి 31 - ఏప్రిల్ 4) వక్ఫ్ సవరణ బిల్లుతో సహా అనేక బిల్లులు ఆమోదం పొందాయి. రాబోయే వర్షాకాల సమావేశాల్లో, అధికార పక్షం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. వాటిలో కొన్ని: మణిపూర్ జీఎస్టీ (సవరణ) బిల్లు 2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, ఐఐఎం (సవరణ) బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు, 2025, జియో హెరిటేజ్ సైట్స్ అండ్ జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు 2025, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు 2025, జాతీయ క్రీడా పాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు.

ఈ సమావేశాల్లో ప్రతిపక్షాల నుంచి కేంద్రానికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయో, ఏయే బిల్లులు ఆమోదం పొందుతాయో వేచి చూడాలి. పార్లమెంట్ సజావుగా సాగుతుందా, లేక ప్రతిపక్షాల ఆందోళనలతో "రణరంగంగా" మారుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

## బోనాల గిఫ్ట్?

హైదరాబాద్: ప్రముఖ తెలుగు సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.కోటి ప్రోత్సాహం అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం పాతబస్తీ బోనాల సందర్భంగా తాజాగా రూ.కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. రాహుల్ సిప్లిగంజ్ స్వయం కృషితో ఉన్నత స్థాయికి చేరుకున్నారని, యువతకు ఆదర్శమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ఇటీవల హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ సిప్లిగంజ్‌కు సాయం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. 'హైదరాబాద్ పాతబస్తీ పిల్లోడు రాహుల్ సిప్లిగంజ్ అద్భుతంగా పాడి ఆస్కార్ అవార్డ్ పొందే వరకు వెళ్లాడు. అతడికి గద్దర్ పురస్కారం దక్కలేదని, ప్రతిభకు తగ్గట్లుగా అవార్డుగానీ, మరో ప్రోత్సాహకంగానీ ఇవ్వాలని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆర్థిక మంత్రి భట్టిగారిని కోరుతున్నాను' అని విజ్ఞప్తి చేశారు. దానికి భట్టి విక్రమార్క అక్కడే సానుకూలంగా స్పందించారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల సందర్భంగా రాహుల్‌కు నజరానా ప్రకటించారు. నాటు నాటు, బొమ్మోలే ఉన్నదిరా పోరి, కాలేజ్ బుల్లోడా, రంగా రంగా రంగస్థలానా వంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర ప్రైవేటు ఆల్బమ్స్‌తో రాహుల్ ఆడియన్స్‌ను అలరించారు. సీనియర్ దర్శకులు కృష్ణవంశీ డైరెక్షన్‌లో వచ్చిన రంగమార్తాండ సినిమాతో నటుడిగానూ ఆకట్టుకున్నారు.

## తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్: ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు విమాన ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడేలా చేస్తున్నాయి. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ఘటన మరువక ముందే పలు విమానాలు సాంకేతిక సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవుతున్నాయి. తాజాగా శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ ఎస్‌జీ-2138 విమానంలో టెక్నికల్ ఇష్యూస్‌తో నిలిచిపోయింది. విమానం బయల్దేరడానికి ముందే సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ విషయాన్ని అధికారులకు చేరవేశారు. దీంతో సంస్థ ఆ సర్వీసును రద్దుచేసింది. అందులో తిరుపతి వెళ్లాల్సిన 54 మంది ప్రయాణికులను మరో విమానంలో పంపేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో సాంకేతిక సమస్యను ముందుగానే గుర్తించడంతో పెను ప్రమాదమే తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అదే గాల్లో ఉండగా ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఎలా ఉండేదోనని అంటున్నారు.గత నెల 16న కూడా ఇదే సర్వీస్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్ జెట్ 2138 నంబర్ విమానంలో కాలిన వాసన రావడంతో విమాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. టేకాఫ్ ముందే ఫ్లైట్‌ని ఎయిర్ పోర్టులో నిలిపివేసి చెక్ చేసారు. క్షణాల్లో గాల్లో ఎగరాల్సిన విమానం సాంకేతికలోపం కారణంగా ఎయిర్ పోర్టులో నిలిపివేయడంతో ప్రయాణికులు సుమారు మూడున్నర గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

## దేశానికి బిగ్ బాస్ కాదు, బిగ్ బ్రదర్ కావాలి

చేసే పరిస్థితి వస్తుంది. ఇది భారతదేశానికి ఎంతో ప్రమాదకరం, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం" అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

**హిందీ రుద్దకం: భాషా సామరస్యానికి విఘాతమా** దేశంలో హిందీని బలవంతంగా రుద్దడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. "భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం. అలాంటి దేశంలో హిందీ భాష అందరూ నేర్చుకోవాల్సిందేనని చెప్పడం తగదు. హిందీ ప్రమోషన్ కోసం కేంద్రం కోట్లు కేటాయిస్తున్నది. తెలుగు కోసం ఎందుకు నిధులు ఇవ్వడం లేదు?" అని ప్రశ్నించారు. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు హిందీ బలవంతపు రుద్దకాన్ని వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేస్తూ, "దేశానికి రాజ్య భాష ఎందుకు? స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయింది. ఇప్పటికీ అందరూ బాగానే ఉన్నారు. ఇప్పుడు కొత్తగా హిందీని అందరిపై ఎందుకు బలవంతంగా రుద్దాలి?" అని కేటీఆర్ నిలదీశారు.

**కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిశిత విమర్శలు:**

'బీజేపీ లాభాల రాజకీయం': "బీజేపీకి లాభం ఉంటేనే ఏదైనా పనిచేస్తుంది. పార్టీపరంగా తనకు ఏమి లాభం లేదని ఏమీ చేయదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**కశ్మీర్ విభజన:** "కశ్మీర్‌ను రెండు రాష్ట్రాలుగా ఎవరైనా మార్చాలని అడిగారా? ఎందుకు మార్చారు? రాజకీయ ప్రయోజనం కోసం కాదా?" అని ప్రశ్నిస్తూ, మోదీ సర్కారు భారత దేశ సమాఖ్య స్ఫూర్తికి గండి కొడుతోందని ఆరోపించారు.

**వలస కార్మికుల పట్ల కేసీఆర్ మానవత్వం:** 2020-21 కోవిడ్ కాలంలో యూపీ, రాజస్థాన్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులను కేసీఆర్ సొంత బిడ్డల్లా చూసుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. వారికి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసి స్వస్థలాలకు పంపిన దేశంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు.

**ఎంఎస్ఎంఈలకు ఆహ్వానం:** హైదరాబాద్‌లో మంచి వనరులు ఉన్నాయని, ఎంఎస్ఎంఈ కంపెనీలు అక్కడ పెట్టుబడులు పెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**అంశాలవారీ మద్దతు:** "2014-23 వరకు మోదీకి పూర్తిగా ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. అంశాలవారీగా మద్దతు ఇచ్చాం. సమాఖ్య దేశంలో రాష్ట్రాలు, దేశం కలిసి వెళ్లాలన్నదే తమ అభిమతం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.కేటీఆర్ వ్యాఖ్యలు కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, భాషా విధానం, డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాలపై బీఆర్ఎస్ పార్టీ యొక్క దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశాయి. ఈ వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చకు దారితీసే అవకాశం ఉంది.

## వైభవంగా బోనాల జాతర

హైదరాబాద్: తల్లిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. బోనాలు సమర్పించి సల్లంగా సూడమ్మ అని ప్రార్థిస్తున్నారు. తెల్లవారుజామున కుమ్మరిబోనం సమర్పించడంతో మహంకాళి బోనాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు.భాగ్యనగరం బోనమెత్తింది. అమ్మల కన్నా మాయమ్మ సల్లంగా సూడమ్మ అంటూ భక్తులు లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వర్షాలు కురవాలని పిల్లాపాపలు, పాడి, పంటలు బాగుండాలని వేడుకుంటున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెల్లవారుజామున కుమ్మరిబోనం సమర్పించడంతో ప్రారంభమైన బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తుల బోనాలు, శివసత్తుల ఆటలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు : ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పీసీసీ అధ్యక్షుడు సహా కాంగ్రెస్ పార్టీ పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా పలువురు నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కావాల్సిన నిధులు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. రాష్ట్రాన్ని అగ్రపథాన నిలపాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో ఆషాఢ బోనాలు చివరి అంకానికి చేరాయి. నాలుగో ఆదివారమైన ఇవాళ నిర్వహించే ఈ వేడుకల్లో అమ్మవారికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. కేంద్రమంత్రి బండిసంజయ్, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, మాధవీ లత మహంకాళిని దర్శించుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్? నాయుడు, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో తులతూగాలని, ఆయురారోగ్యాలు చేకూర్చాలని వేడుకున్నామన్నారు.పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు : అమ్మవారి దర్శనం కోసం భక్తులకు 3 ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 12 వందల మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జాయింట్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఆషాఢ బోనాల పండగ వేళ జంటనగరాల్లో పండగవాతావరణం నెలకొంది. హైదరాబాద్ చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డితో కలిసి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు.బోరబండలో పోచమ్మ ఆలయాన్ని మంత్రి తుమ్మల దర్శించుకున్నారు.

# శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మహారాష్ట్ర ఆర్.పి.ఐ పార్టీ నాయకులు

మనప్రజాప్రతినిధి/రాజన్నజిల్లా జూలై ,20 :రాజన్న సిరిసిల్ల జిల్లాలోని దక్షిణ కాశీగా పేరుందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన మహారాష్ట్ర ఆర్ పి ఐ(ఏ) పార్టీ బివండి తానేజిల్లా యూత్ ప్రెసిడెంట్ అడ్వాకేట్ అంబాదాస్ గైక్వాడ్,మరియు మహారాష్ట్ర ఎన్డి టీవీ రిపోర్టర్ సందీప్,ఖండూ ఉభలే,మార్గ గోపి,దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచన మండపంలో మహారాష్ట్ర భక్తులకు స్వామివారి కండువా కప్పి తీర్ధ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.




# రాఘవాపురంలో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు





మనప్రజాప్రతినిధి//మేళ్లచెరువు: మేళ్లచెరువు మండలం రాఘవాపురం గ్రామంలో శ్రీ జగదాంబ అమ్మవారి ఆషాడ మాస బోనాల కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.. తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాస బోనాల పండుగను హైదరాబాదులోనే జరుపుకుంటారు.. తొలిసారిగా హుజూర్నగర్ నియోజకవర్గం మేళ్లచెర్వు మండలం రాఘవపురం గ్రామంలో ఆషాడ మాస బోనాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు... శ్రీ జగదాంబ అమ్మవారికి శాకాంబరి అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలతో, మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు అమ్మవారికి ఆషాడ మాస బోనాలు సమర్పించారు...ఈ కార్యక్రమంలో సాతులూరి గోవిందరావు, సాంబశివరావు, మణికుమార్ నరసింహారావు, సైదయ్య, చిన్న సైదయ్య, శ్రీహరి, శంకరయ్య, అమరయ్య, వెంకట్రావు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొని తొలిసారి జగదాంబ అమ్మవారి ఆషాడ మాస బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# సంక్షోభంలో సాగు ఎరువుల కొరతతో రైతన్న కంట కన్నీరు

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస//ప్రజా ప్రతినిధి: వైఎస్సార్ సీపీ పార్టీ మండలం అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు ఆవేదన కూటమి సర్కార్ పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని సరుబుజ్జిలి మండలం వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం తన స్వగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత వైసిపి పరిపాలనలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సాగుకు అవసరమయ్యే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టంగా తీసుకునేది అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యేసరికి, రైతులతో ఈకేవైసీ తీసుకొని రైతులకు అవసరమయ్యే సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావటం జరిగేవన్నారు.సాగుకు అవసరమయ్యే కనీస ఖర్చులకు రైతు భరోసా పథకంలో భాగంగా నగదును జమ చేయడం జరిగేది అన్నారు. సకాలానికే రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యతతో



కూడిన విత్తనాలు,ఎరువులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయ సాగును రైతులు పండగగా జరుపుకునే వారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. రాష్ట్రంలో పలు వర్గాలకు చెందిన ప్రజానీకానికి సాయం అందించాల్సిన కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా దాడులు జరిపించడం, తప్పుడు కేసులు బనాయించి జైల్లో వేయించడం వంటి విషయాల్లో మాత్రమే ముందు ఉందన్నారు. సంక్షేమం అనే పదాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతులకు ఇవ్వాల్సిన ఎరువులు ఆర్బికేల్లో కాకుండా, కూటమి ప్రభుత్వంలో పలువురు నాయకులు తమ వ్యక్తిగత ఇళ్లను గోడౌన్లుగా మార్చుకుంటున్నారన్నారు. వీటిల్లోనే ఎరువులు నిలువ చేస్తూ, తమకు కావలసినవారికి అందజేస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలు మూలంగా కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి, వ్యవసాయ సాగును సంక్షోభంలోకి నెడుతున్నారన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జెడి, క్రింది స్థాయి అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చాలాచోట్ల ఇప్పటికే వరి నాట్లు కొనసాగుతున్నాయన్నారు.నాట్లు వేసిన రైతాంగం ఎరువులు కోసం ఎదురుచూపులు చూస్తున్నారన్నారు.మండల కేంద్రాల్లో ఎరువుల కోసం రైతులు క్యూ కడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలికి, వాస్తవిక పాలనలోకి రావాలన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు అవసరమయ్యే ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా వ్యవసాయ శాఖ మంత్రి కృషి చేయాలని కోరారు.

# ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం

ప్రజాప్రతినిధి//ఏర్పేడు మండలం :తిరుపతి జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మొట్టమొదటి గా ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం, తేది: 20-07-2025 న జరిగినది.ఈ క్రమంలో తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న మన కులస్థుల యొక్క పిల్లల యొక్క ప్రతిభను గుర్తించి వారిలో ఉన్న నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో వారిని ఎంపిక చేసి వారికి ప్రతిభ పురస్కారాలను అందించడం జరిగింది. ఈ ఎంపిక కార్యక్రమంలో భాగస్వాములైన ఉపాధ్యాయులకు, కమిటీ సభ్యులకు జిల్లాలో ఉన్న కుమ్మర కుటుంబ సభ్యుల తరపున వారికి కృతజ్ఞతలు.ఎంపిక చేయబడిన





పిల్లలు :- 1 అచ్యుత్ - తిరుపతి నగరం, 2.సరయు తిరుపతి నగరం, 3.ఛార్మి - తిరుచానూరు పట్టణం, 4.లోకేశ్వరి - యల్లంపల్లి 5.. హాసిని - యల్లంపల్లి 6.ప్రణతి - కనపర్తి7. భవానీ - పాపనపల్లి వీరందరికీ జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యుల యొక్క ఆశీస్సులు తెలియ జేస్తున్నారు.సమాజంలో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, లాయర్లు , ఇంజనీర్లు మరియు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు.మన కమ్యూనిటీ విద్యార్థులను ఆ స్థాయిలో రావాలనే ఉద్దేశ్యతో మేము ప్రతిభా పురస్కారాలను అందించే కార్యక్రమం ద్వారా ప్రోత్సహించే విధానాలను భవిష్యత్తులో కూడా కొనసాగు తుందని తెలియజేయు చున్నాము. ప్రతీ సంవత్సరం మెరిట్లో పాసైన ప్రతీ విద్యార్థిని విద్యార్థులు మన సంక్షేమ సంఘం జిల్లా సభ్యులకు తెలియజేసి నట్లైతే వారి ఇంటిదగ్గరికే వెళ్లి నగదు,మరియు మెమంటో పురస్కారం చేయడం జరుగుతుందని తెలియ జేయుచున్నాము.ఈ కార్యక్రమానికి సహాయ సహకారం అందించిన మన కులబంధువులకు, కుటుంబ సభ్యులకు అందరికి పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి సహకరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు నగరం శ్రీరాములు గారు(రిటైర్డ్ ) ఎస్బిఐ గూడూరు వెంకటేశ్వర్లు, బండారుపల్లి దేవరాజులు గానుగ పెంట రమేష్. పులికొండ బాలకృష్ణ. ఎల్లంపల్లి సుబ్రమణ్యం నరేష్ , విద్యార్థుల తల్లితండ్రులు, మరియు కులపెద్దలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చెయ్యడం జరిగింది.

# బెంగళూరు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

ప్రజాప్రతినిధి //తిరుపతిజిల్లా: బెంగళూరు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలోని స్థానిక వైద్యుల కోసం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో డా. ఎ. ఆర్ రెడ్డి, డా. పి.రెడ్డప్ప, డా. రవి రాజ్, డా. దామోదరం, డా. నాగేశ్వర రావు, డా. ప్రవీణ్ వంటి ప్రముఖ వైద్యులతో పాటు ప్రభుత్వ వైద్యులు కూడా పాల్గొన్నారు.సమాజ సేవ మరియు ఆరోగ్య శిబిరాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడానికి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ మరియు షుగర్ పరీక్షలు కూడా




నిర్వహించబడ్డాయి. అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలను కూడా చేపట్టారు.ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, మంచి నీటిని మాత్రమే వినియోగించాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని డా. పి రెడ్డప్ప ఈ సందర్భంగా తెలిపారు.

# సిపిఐ జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

సదాశివాపేట జులై 20 (మన ప్రజా ప్రతినిధి): సదాశివపేట: సిపిఐ నాలుగో మహాసభలను ఆగస్టు 2,3వ తేదీ ల్లో జరగనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సబ్యుడు తాజొద్దీన్ అన్నారు. ఆదివారం సదాశివపేటలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా నాలుగో మహా సభల కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నారాయణఖేడ్లో వచ్చే నెల రెండు మూడవ తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు




నాయకులు చేయాలన్నారు. సదాశివపేట సంగారెడ్డి మునిపల్లి కొండాపూర్ నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్య సదాశివపేట సంగారెడ్డి మునిపల్లి కొండాపూర్ మండలాల నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్య లో తరలి రావాలని కోరారుు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం ఎ. రెహమాన్ , వ్యవసాయ కార్మిక సంఘం మహిల కార్యదర్శి బుజ్జమ్మ, సీనియర్ నాయకులు పూలమ్మ, మునిపల్లి మండల నాయకురాలు గంగమ్మ, లడ్డు లక్ష్మి, శివ లీలా, సరస్వతి, బేబీ, బిపాషా తదితరులు పాల్గొన్నారు

# సుపరిపాలన తొలి అడుగు

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస//ప్రజాప్రతినిధి దినపత్రిక :ఈరోజు చిగురువలస పంచాయతీలో డిసిసిబి చైర్మన్ శివ్వల సూర్యనారాయణ గారు. మండల పార్టీ అధ్యక్షులు అంబల్లా రాంబాబు గారు. క్లస్టర్ ఇంచార్జ్ లావేటి పూర్ణ గారు. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ పాలన అభివృద్ధి సంక్షేమాలు ఎలావున్నాయి అని స్వయంగా ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిగురువలస పంచాయతీ కమిటీ అధ్యక్షులు. బసవ ఉమామహేశ్వరరావు. పల్లి రాము కోర్ను సూర్యనారాయణ తోట రాంబాబు ముద్దాడ లచ్చుము.పెద్ద ఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు



# మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి

మన ప్రజాప్రతినిధి/మానకొండూర్ తేదీ 20 జులై : ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు మాదిగ అద్వర్యలో వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం వికలాంగుల పోరాట సమితి కన్వీనర్ గా కేతిరెడ్డి లక్ష్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి పుట్ట రవి మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 500 రూపాయలు ఉన్న వికలాంగులకు



-వికలాంగుల పోరాట సమితి కన్వీనర్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి

4000 రూపాయలు పెన్షన్ రావడం పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ తోనే సాధ్యమయింది అని చెప్పారు. ఈ నెల 27 వ తేదీన జరగబోయే ఆసరా పెన్షన్ దారుల సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కు వస్తున్న మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కాసుపాక సురేష్ ,నాయకులు పసుల వెంకట్,మార్కెట్ కమిటీ సభ్యులు మచ్చ రాజేశం, లక్ష్మణ్,మంజుల,లావణ్య, రాజయ్య ,బీడీ కార్మికులు, అన్ని రకాల పెన్షన్ దారుల పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన బిఆర్ఎస్ నాయకులు

మనప్రజాప్రతినిధి //చేర్యాల, జనగామ:జనగామనియోజకవర్గం,చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం రోజున మన ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,డాక్టర్ పల్లారాజేశ్వర్ రెడ్డి, మంజూరు చేయించిన సి.ఎం.ఆర్.ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను పల్లా ఆదేశాల మేరకు చేర్యాల పట్టణంలోని లబ్ధిదారులకు పంపిణీ




చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య,జిల్లా నాయకులు అంకు గారి శ్రీధర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు,మంగోల్ చంటి,ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ పూర్మ వెంకటరెడ్డి, యూత్ ఇన్చార్జి శివ గారి అంజయ్య,పట్టణ కార్యదర్శి బుర గోని తిరుపతి గౌడ్,యాట యాదగిరి,బి రెడ్డి ఇన్నారెడ్డి,పచ్చి మడ్ల సిద్ధిరాములు గౌడ్, పచ్చిమడ్ల మానస,నర్రా ఐలయ్య,కూరపాటి మధు,బుడిగే శీను గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# గొర్రెలకు మేకలకు వ్యాక్సిన్లు పంపిణీ చేయాలి

మనప్రజాప్రతినిధి//చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గం చేర్యాల పట్టణ కేంద్రంలో ఆదివారం రోజున సంఘం చేర్యాల మండల మహాసభ చేర్యాల పట్టణంలోని బీరప్ప దేవాలయంలో ఏగుర్ల ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వానకాలం ప్రారంభమై జీవాలకు అనేక రోగాలు వస్తున్నాయని వీటికి సంవత్సరానికి మూడుసార్లు నట్టల మందు పంపిణీ చేయాల్సి ఉండగా గత మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వాలు సప్లై చేయకుండా



-గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి

తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు పశుసంవర్ధక శాఖ వైద్యులు ప్రైవేటు మెడికల్ షాప్ లతో కుమ్మక్కై మెడికల్ షాప్ లకు మందులు రాస్తున్నారని మెడికల్ షాప్ యాజమాన్యాలు ఇదే అదునుగా భావించి గొర్ల కాపరులను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వాలు జీవాలకు ఉచిత మందులు పంపిణీ చేయాలని,వెటర్నరీ మెడికల్ షాప్ ల ఆగడాలను అరికట్టి గొర్ల కాపరులను ఆదుకోవాలని లేనిపక్షంలో గొల్ల కురుమలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం చేర్యాల మండల మండల కమిటీని ఎన్నుకున్నారు మండల అధ్యక్షులుగా నంగి చంద్రమౌళి ఉపాధ్యక్షులుగా తుపతి రాజు,కార్యదర్శిగా దాసరి కనకయ్య,సహాయ కార్యదర్శిగా దేవులపల్లి కర్ణాకర్,ముఖ్య సలహాదారుగా ఏగుర్ల ఎల్లయ్య,కమిటీ సభ్యులుగా గుంటి స్వామి, ఆవుల యాదగిరి,బీరయ్య, బాబు,లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

# శ్రీ కాంతాచారి విగ్రహం ఏర్పాటుకు కమిటీ

సత్తుపల్లి//మనప్రజాప్రతినిధి న్యూస్ జులై 20.:తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో తొలి వీర మరణం పొందిన శ్రీకాంతాచారి విగ్రహ ఏర్పాటు కొరకు గత వారం రోజుల నుంచి సమావేశాలు నిర్వహించి సత్తుపల్లి శాసనసభ్యులు శ్రీ డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ని కలిసి శ్రీకాంతాచారి విగ్రహం పెట్టడానికి మాకు స్థలం చూపించమని కోరడం జరిగినది దానికి మన సత్తుపల్లి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ ఆఫీస్ పక్కన మన శ్రీకాంతాచారి విగ్రహం ఏర్పాటు కి స్థలం కేటాయించడం జరిగినది. మన సత్తుపల్లి విశ్వబ్రాహ్మణుల సంఘం తరఫున ఎమ్మెల్యే శ్రీమతి మట్టా రాగమయి దయానంద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ ఆదివారం నాడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో మన విశ్వకర్మలంతా కలుసుకొని విగ్రహ ఏర్పాటుకు పెద్ద చిన్న తేడా లేకుండా మనమంతా ఐక్యతగా ఉండి విగ్రహ ఏర్పాట్లు అందరం భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. మరియు పెద్దల సమస్యల్లో దీనికి విగ్రహ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయాలని పెద్దలు సూచించారు దీనికి ఒక కమిటీని వేద్దామని అధ్యక్షులుగా వెలిశాల నాగేంద్ర చారి, ప్రధాన కార్యదర్శి డి.ఎన్ చారి, గౌరవ అధ్యక్షులు ఎం రామకృష్ణ, బాణాల సత్యనారాయణ ,కే మోహనా చారి, అనంతోజు రాఘవాచారి, ముఖ్య సలహాదారులుగా వెలిశాల జనాచారి, ఎం ఏడుకొండలు ,ఓలేటి శ్రీహరి, మునగాల వెంకటేశ్వరరావు, ఏలేశ్వరి,కే కృష్ణమాచారి, ఏలేశ్వరం వీరభద్రాచారి ,రామకృష్ణ, ఎర్రోజు పురుషోత్తం తదితరులను కలుపుకొని కమిటీ వేయడం జరిగినది .ఈ కమిటీ అందరూ సహకరించగలరని కోరుతున్నామని చెప్పారు



# కొమరవెల్లి మల్లన్న క్షేత్రంలో "ఈ" హుండీ ఏర్పాటు

మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఉత్తర్వుల మేరకు ఆదివారం రోజున శ్రీ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో ఆన్లైన్ డిజిటల్ లావాదేవీల్లో భాగంగా 'ఈ 'హుండీ ఏర్పాటు చేయడం జరిగింది స్వామివారి దేవాలయంలో రెండు చోట్ల మరియు బుకింగ్ కార్యాలయం ప్రసాద విక్రయశాల మరియు నిత్యాన్నదాన సత్రం నందు"




ఈ "హుండీలు కార్యనిర్వాహణాధికారి ఎస్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఎస్బిఐ కొమురవెల్లి శాఖ వారు ఏర్పాటు చేసిన "ఈ" హుండీలను ఈరోజు ప్రారంభం చేయడం జరిగినది."ఈ "హుండీ ప్రారంభించిన సందర్భంలో ధర్మకర్త జయప్రకాశ్ రెడ్డి పదివేల నూట పదహారు రూపాయలు (10116) విరాళం ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్,అర్చకులు మనోహర్,ధర్మకర్తల మండలి సభ్యులు జయప్రకాశ్ రెడ్డి,ఆలయ ఏ ఈ ఓ శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు,సురేందర్ రెడ్డి, క్లర్క్,శ్రీనివాస్ రెడ్డి నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డ నారాయణరావు సంతాప సభను జయప్రదం చేయండి

నేరేడుచర్ల//మనప్రజా ప్రతినిధి:స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట యోధులు అమరజీవి దొడ్డ నారాయణరావు సంతాప సభ ను ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు చిలుకూరు లో నిర్వహించనున్నట్లు అట్టి బహిరంగ సభను జయప్రదం చేయాల్సిందిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు ఆదివారం నాడు ఆయన నారాయణరావు సంతాప



సభ కరపత్రాలను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ నారాయణరావు త్యాగం వల్ల ఈ మట్టికి చైతన్యం వచ్చిందని ప్రాణాలు ఫణంగా పెట్టి ఈ ప్రజల కోసం రాజీలేని నిజాయితీ జీవితం గడిపారని ఆయనధైర్యం, స్వార్థరహిత సేవా దృక్పథం,ఐక్యత భావన, త్యాగశీలత,దృఢమైన సంకల్పం సామాజిక న్యాయం లాంటి అంశాలను యువత ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు తన అన్న స్వర్గీయ దొడ్డ నరసయ్య ప్రోత్సాహంతో సాయుధ పోరాటంలో పాలు పంచుకొని కార్యకర్తగా కమాండర్ గా నాయకుడిని చేశాయని ఆనాటి నుండి ఆయన జీవితం త్యాగం ఒక ఆదరణ స్వాతంత్ర సమరయోధుడిగా సమాజ మార్గదర్శిగా రైతులు హక్కుల రక్షణ కోసం భూమి హక్కులు సాగునీటి హక్కులు ధరల స్థిరీకరణ వంటి అంశాలతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ఒక ప్రజా ప్రతినిధి గానే కాకుండా ఒక ప్రజా గొంతుకై రైతుల హక్కుల రక్షకుడుగా నిలిచారని ఆయన కొనియాడారు కరపత్రాల విడుదల కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి పట్టణ సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ పాల్గొన్నారు

# వన మహోత్సవం పచ్చదనపు పండుగ

నేరేడుచర్ల//మనప్రజా ప్రతినిధి:లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఈరోజు అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో వన మహోత్సవ కార్యక్రమం క్లబ్ అధ్యక్షులు లయన్ గుండ్రెడ్డి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధ్యక్షులు లయన్ గుండ్రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ "పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మొక్కలు నాటటం ఒక చిన్న పని అయితే, దీని ఫలితం ఎంతో మహత్తరమైనది. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ కారణంగా భూగోళం వేడెక్కుతోంది. దీన్ని అరికట్టే మార్గం ఒక్కటే అదే మొక్కలు నాటటం, చెట్లను




సంరక్షించటం," అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ లయన్ కొణతం సీతారాంరెడ్డి, బట్టు మధు, ఎడవల్లి సత్యనారాయణ రెడ్డిలయన్స్ క్లబ్ సభ్యులు బసవ కోటేశ్వరరావు, తక్కెళ్ళ నాగార్జున తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్ళించడానికే బంద్ కు పిలుపు

మనప్రజాప్రతినిధి//చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గ కొమురవెల్లి మండల కేంద్రంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్ళించడానికే బంద్ నిర్వహిస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు. దశాబ్దాల తరబడి ఘనమైన చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతం గత కొంతకాలం నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవడం కారణంగా బలమైన స్థానిక రాజకీయ నాయకత్వం లేకపోవడం కారణంగా నేడు తన ఉనికి అస్థిత్వమే ప్రశ్నార్థకంగా మారిన దశలో ఈ ప్రాంత బిడ్డలుగా చేర్యాల ప్రాంతానికి పూర్వవైభవం మళ్లీ తీసుకురావడం కోసం ఈ ప్రాంత ప్రజలుగా ప్రజలతో మమేకమై రాజకీయ పార్టీలను ఒకే ఏజెండాపై తీసుకొచ్చి ఆ ఎజెండాలు ప్రజల ఎజెండాగా మార్చి రెవెన్యూ డివిజన్ సాధించి రానున్న రోజుల్లో 2026 లోపు డిలిమిటేషన్ లో అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో ఈనెల ఇరవై ఐదు న జరిగే మండల కేంద్రాల బంద్ కు సబ్బండ వర్గాల ప్రజలు ఈ బంద్ లో పాల్గొని బలమైనటువంటి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం కోసమే ప్రజలలో కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందే అశోక్, అందె బీరయ్య, బస్వగళ్ళ సిద్దయ్య, బుట్టి నారాయణ,జంగిలి యాదగిరి,మల్లం అంజయ్య,కర్రె నర్సిరెడ్డి, గద్దల కనకయ్య, రజనీకాంత్,సురేష్, మల్లేశం,రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలకు క్షీరాభిషేకం

-స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు నలబై రెండు శాతం రిజర్వేషన్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ
-కాంగ్రెస్ అగ్రనేతలకు క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్



మనప్రజాప్రతినిధి//దినపత్రిక, చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం,నర్మేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాగపూర్ కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలోనలబై రెండు శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ పై త్వరలో ఆమోదం తప్పకుండ అవుతుందిని, గత పాలకులు ముప్పై మూడు శాతం ఉన్న బీసీ రిజర్వేషన్ ఇరవై మూడు శాతం తగ్గించిన దుర్మార్గమైన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అన్నారు బీసీలకు రిజర్వేషన్ అంశంపై బిఆర్ఎస్,బిజెపి,పార్టీలు మాట్లాడకపోవడం,బీసీలను ఈ పార్టీలు మోసం చేసినట్టే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందని,కాంగ్రెస్ పార్టీ బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ తెస్తున్నందుకు మద్దతుగా జనగాం జిల్లా నర్మెట్ట మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి,బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, మరియు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి, క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. విక్రం ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.





# పేదలకు అండగా

## ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్



మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం,నర్మెట్ట మండల కేంద్రలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ సీఎంఆర్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు.నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా,ఏడు లక్షల రూపాయలు(7,00,000)మంజూరయ్యాయి. చెక్కులను బాధిత కుటుంబాలకు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ దే అన్నారు.అన్నివర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మందికి సీఎం సహాయ నిధి నుంచి కోట్ల రూపాయల సాయం అందించినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో సాయం అందజేస్తానని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతున్న వారు స్థానికుల నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఆపదలో ఆసుపత్రిలో చేరిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సూచించారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నర్మెట్ట గ్రామ శాఖ అధ్యక్షులు ప్రజ్ఞాపురం శ్రీధర్, పిఎసిఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు చెవుల పరుశరాములు, జనగామ మాజీ మండల అధ్యక్షుడు కొన్నే మహేందర్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు





సత్తుపల్లి//మనప్రజాప్రతినిధి న్యూస్‌జులై20: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సత్తుపల్లి యుటిఎఫ్ ఆఫీసులో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తుపల్లి మండల మహాసభ వలపర్తి మోహన్ రావు, బంక వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహాసభలో విష్ణు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న పంచాయతీ సిబ్బంది కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. గ్రామాలలో కష్టపడి పని చేస్తూ అద్దంల తీర్చిదిద్దుతున్న కార్మికునికి మాత్రం కనీస వేతనం లేదన్నారు. పోరాడి సాధించుకున్న వేతనాలు నెలనెలా అందడం లేదన్నారు. వేతనాలు పెంచుతామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఆ దిశగా నిర్దిష్టమైన చర్యలను చేపట్టాలన్నారు. సెలవులు నిమిత్తం లేకుండా అధికారులు, కార్యదర్శులు వెట్టిచాకిరి చేస్తున్నారని అన్నారు. మల్టీ పర్పస్ విధానం పేరుతో కార్మికులను ఘోరమైన వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. గ్రామపంచాయతీలో సంబంధం లేని పనులు చేయిస్తూ ఇదేమి న్యాయం అని ప్రశ్నిస్తే తొలగింపులు వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పంచాయతీ కార్మికులందరూ ఐక్యత ప్రదర్శించి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ మహాసభలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్, తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, సిఐటియు జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, రైసంగం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, సిఐటి యు పట్టణ కార్యదర్శి కోలిక పోగు సర్వేశ్వరరావు, ప్రజానాట్యమండలి బాధ్యులు అయినంపూడి సనందరావు, కండే సత్యం, పాల్గొన్నారు. మండల మహాసభలో నూతన అధ్యక్ష కార్యదర్శులు భయ్యా రమేష్, వనపర్తి మోహన్రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 11 మందితో కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# సిపిఐ జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



సదాశివాపేట జులై 20 (మన ప్రజా ప్రతినిధి) : సదాశివపేట: సిపిఐ నాలుగో మహాసభలను ఆగస్టు 2,3వ తేదీ ల్లో జరగనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజొద్దిన్ అన్నారు. ఆదివారం సదాశివపేటలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా నాలుగో మహా సభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నారాయణఖేడ్లో వచ్చే నెల రెండు మూడవ తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు నాయకులు చేయాలన్నారు. సదాశివపేట సంగారెడ్డి మునిపల్లి కొండాపూర్ నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్య సదాశివపేట సంగారెడ్డి మునిపల్లి కొండాపూర్ మండలాల నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్య లో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం ఎ. రెహమాన్ , వ్యవసాయ కార్మిక సంఘం మహిల కార్యదర్శి బుజ్జమ్మ, సీనియర్ నాయకులు పూలమ్మ, మునిపల్లి మండల నాయకురాలు గంగమ్మ, లడ్డు లక్ష్మి, శివ లీలా, సరస్వతి, బేబీ, బిపాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..




ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా :తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.. ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఘనంగా జరిగింది. అన్ని వయస్సులు కలిగిన 300 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెస్ టోర్నమెంట్ ను పరిశీలించారు. వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీ, పురుషులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఐదేళ్ల వయస్సు కలిగిన బాలబాలికలు 70 ఏళ్ల వయస్సు కలిగిన వారితో కూడా చెస్ ఆడడం గర్వకారణం అన్నారు. విద్యార్థులు చెస్ ఆడడం వలన జ్ఞాపక శక్తి పెరిగి మంచి ఉన్నత చదువులతో రాణించవచ్చినని పేర్కొన్నారు. యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు తో మాట్లాడి త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చెస్ పై శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ డైరెక్టర్ బాలాజీ, శ్రీనివాస సూరి, అనిల్,సిసింద్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 3 న లక్కవరం గ్రామంలో ముత్యాలమ్మ జాతర



మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్ :హుజూర్ నగర్ లోని లక్కవరం గ్రామంలో ముత్యాలమ్మ గుడిలో గ్రామ పెద్దలు కుల పెద్దలు ప్రజలు కమిటీ సభ్యులు సమావేశమై ఆగస్టు 3 ముత్యాలమ్మ జాతరను నిర్వహించుటకు నిర్ణయించినారు ఇట్టి ముత్యాలమ్మ జాతరలో భాగంగా జులై 31 గ్రామంలో చల్ల కుండ ఎత్తే కార్యక్రమం ఆగస్టు 3 న ముత్యాలమ్మ జాతర నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగింది.కావున గ్రామ ప్రజలు ముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని తెలియజేస్తూ ముత్యాలమ్మ జాతర నిర్వహణ లక్కవరం గ్రామ కమిటీ తెలియజేశారు

# పాములపాడులో
## “బాబు షూరిటీ-మోసం గ్యారంటీ”కార్యక్రమంలో
# వైఎస్ఆర్సిపి, డాక్టర్ దారా సుధీర్



పాములపాడు జూలై 20 మన ప్రజా ప్రతినిధి:మండల కేంద్రమైన పాములపాడులో ఈరోజు (రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో) చంద్రబాబు మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ కరపత్రాలను వైఎస్ఆర్సిపి నందికొట్కూరు నియోజవర్గం ఇంచార్జ్-డాక్టర్- ధారా సుధీర్, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ తెలుగు.నాగరాజు, మండల కో ఆప్టెడ్ మెంబర్ - సయ్యద్.ముర్తుజాఅలీ, మద్దూరు ఎంపీటీసీ- బషీర్ అహమ్మద్, చెలిమిల్ల ఎంపీటీసీ-సురేష్, మద్దూరు-అబ్దుల్ జబ్బార్, మద్దూరు ఉప సర్పంచ్ శీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడు-సయ్యద్ భాష, జంశీర్, షఫీ, ఇషాక్ , మహబూబ్ బాషా, హుస్సేన్ భాష,ప్రభాకర్, శెట్టి శివలింగం, స్వామి దాసు, మున్నా ,కమలాకర్, కృష్ణానగర్ రామకోటి నాయక్ , రాముడు, శేషు , దరగయ్య, మూర్తుజా, ఇబ్రాహీం,యుగంధర్ రెడ్డి, చలమరెడ్డి, పుల్లయ్య, రాజు, ఆనంద్ , కృపాకర్, హిదయతుల్ల , ప్రకాష్, వెంకటేష్ , నారాయణ స్వామి, తదితరులతో కలిసి విడుదల చేయడం జరిగింది.ఈ రోజు బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంపై మండల కేంద్రమైన పాములపాడులో మండల స్థాయి నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నందికొట్కూరు నియోజవర్గం ఇన్చార్జి డాక్టర్- ధారా సుధీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, సంపద సృష్టిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కంటే ఎక్కువ పథకాలను ఇస్తానని నమ్మబలికి ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు.బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారంటీ అని అధికారంలోకి వచ్చాడని, నేడు అన్ని గ్రామాల్లో ప్రజల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ గురించి ప్రజలకు తెలపాలని నాయకులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఘనంగా బోనాల జాతర

మనప్రజాప్రతినిధి//సంగారెడ్డి జిల్లా: ఝరాసంఘం మండలంలో గల మాచునూరు గ్రామంలో ఆషాడం మాసం సందర్భంగా బోనాల పండగ ఎంతో ఘనంగా జరుపుకున్నారు. వాడ వాడ లనుండి మహిళలు ఎంతో ఉత్సాహంగా భక్తి శ్రద్ధాలతో అమ్మవారికి బోనం సమర్పించి గ్రామం లోని ప్రజల పట్ల చల్లని చూపు చూడాలని మొక్కుకున్నారు. బాజా భజంత్రి లతో టపాసులు పెల్చుకుంటూ గ్రామ పెద్దలు,యువత కేరింతలతో ఆటపాటలతో ఊరేగింపు గా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం గారు మాట్లాడుతూ ఆశాడమాసంలో మన తెలంగాణ లో జరుపుకునే అతి పెద్ద పండగ బోనాల పండగ. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండగ బోనాలపండగ.ఈ పండగను కులమతాలకతీతంగా గ్రామప్రజలు అందరూ కలిసి జరుపుకోవడం అనేది మన దేశం లో ఎన్నో సంవత్సరాలుగా జరుగుతుంది భిన్నత్వంలో ఏకత్వం కు ఈ పండగ నిదర్శనం ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరుపుకోవడానికి సంహరించిన గ్రామప్రజలకు కృత్ఙతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేగారి జగన్నధం, సిద్దన్న పటేల్, సంగారెడ్డి, మల్లేశం, నర్సిములు, బస్వరాజ్ పటేల్,తులజారామ్,గురు పాటిల్ రాములు,మానేగారి అనిల్,సంగన్న,శివకుమార్ రమేష్,బస్వరాజ్ పటేల్, బీరప్పు,సత్యన్న,శేఖర్ లక్ష్మన్న మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






# అమ్మ ఆశీస్సులు, ప్రజలపై ఉండాలి



మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట జూలై 20 :చేగుంట పట్టణ కేంద్రంలోని శ్రీ మహంకాళి బోనాల ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, అంగరంగ, వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. మాజీ, ప్రజా, ప్రతినిధుల, దాతల సహాయ,సహకారాలతో, అత్యధిక జనసాంద్రతతోకూడిన మహంకాళి జాతర ఉత్సవాలు జరుపుకున్నారు, పురాతన కాలం,నుండి విశిష్టత కలిగిన ఉత్సవాలుగా, వీక్షకులకు,అద్భుత రీతిలో ఆకట్టుకునే విధంగా పట్టణ ప్రాంతమంతా తయారవడం హర్షనీయం.. వివిధ వార్డులో నుండి మహిళలు, అమ్మవారికి,బోనాలను వివిధ రకాల విన్యాసాలతో, అమ్మవారి, ఆలయప్రాంగణంలోకితీసుకొనివచ్చిఅమ్మవారికి మొక్కులు,సమర్పించడం జరిగింది. ఇందులో భాగంగా దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్, శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు, మండల,పట్టణ ప్రజలపై ఉండాలని, ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమమే, నా ఆకాంక్షాన్ని, దాన్ని నెరవేర్చే భాగ్యం కలిగించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు . ఈ ఉత్సవాలలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, తాజా మాజీ, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్ళించడానికే బంద్ కు పిలుపు

## -కొమురవెల్లిలో జేఏసీ నాయకుల పిలుపు



మనప్రజాప్రతినిధి//చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గ కొమురవెల్లి మండల కేంద్రంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్ళించడానికే బంద్ నిర్వహిస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు.దశాబ్దాల తరబడి ఘనమైన చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతం గత కొంతకాలం నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవడం కారణంగా బలమైన స్థానిక రాజకీయ నాయకత్వం లేకపోవడం కారణంగా నేడు తన ఉనికి అస్థిత్వమే ప్రశ్నార్ధకంగా మారిన దశలో ఈ ప్రాంత బిడ్డలుగా చేర్యాల ప్రాంతానికి పూర్వవైభవం మళ్లీ తీసుకురావడం కోసం ఈ ప్రాంత ప్రజలుగా ప్రజలతో మమేకమై రాజకీయ పార్టీలను ఒకే ఏజెండాపై తీసుకొచ్చి ఆ ఎజెండాలు ప్రజల ఎజెండాగా మార్చి రెవెన్యూ డివిజన్ సాధించి రానున్న రోజుల్లో 2026 లోపు డిలిమిటేషన్ లో అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో ఈనెల ఇరవై ఐదు న జరిగే మండల కేంద్రాల బంద్ కు సబ్బండ వర్గాల ప్రజలు ఈ బంద్ లో పాల్గొని బలమైనటువంటి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం కోసమే ప్రజలలో కదలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందే అశోక్, అందె బీరయ్య, బస్వగళ్ళ సిద్దయ్య, బుట్టి నారాయణ,జంగిలి యాదగిరి,మల్లం అంజయ్య,కర్రె నర్సిరెడ్డి, గద్దల కనకయ్య, రజనీకాంత్,సురేష్, మల్లేశం,రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి... ముఖ్యమంత్రి సహాయనిధి



మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట జులై 20, : చేగుంట మండలం లో ముఖ్యమంత్రి సహాయనిధి, మంజూరు అయిన సుమారు 65,000/- వేల రూపాయల విలువగల రెండు చెక్కులను పొలంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ, నిత్యం,ప్రజా సంక్షేమం,నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తానని, ఆపదలో ఉన్న ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించి నిరుపేదల ఆత్మబంధువుగా నిలిచారని అన్నారు. అనారోగ్య సమస్యతో సతమవుతున్న వారికి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పెన్నిధి అని అన్నారు.ఈ కార్యక్రమంలో చేగుంట మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు గ్రామ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు,లబ్ధిదారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రాయికోడ్ లోని హాస్టల్ విద్యార్థుల
# సమస్యలు పరిష్కరించాలి

**- రాయికోడ్ లోని ఎస్ సి, బిసి వసతి గృహాల ను సందర్శించి సమస్యలపై ఆరా.**

**- బిఎస్పి పార్టీ జిల్లా ఇంచార్జి పి.మోహన్**



మనప్రజాప్రతినిధి//రాయికోడ్: నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకునే వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని బిఎస్ పి పార్టీ జిల్లా ఇంచార్జి మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రం లోని ఎస్ సి, బిసి వసతి గృహాలను ఆదివారం అయన సందర్శించారు. వసతి గృహాల్లోని వంటశాల, స్టోర్ రూమ్ లను, పరిసరాలను పరిశీలించారు. బాత్రూం లు, పరిశీలించారు. పిల్లలకు సరిపడా బాత్ రూమ్ లు బెడ్ లు లేకపోవడం పై విచారం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. 125 మందివిద్యార్థులుండగా 3 మరుగుదొడ్లు ఉండటం తో స్థానిక అధికారులుపట్టించుకున్న దాకలాలు కనిపించడం లేదన్నారు. బిసి హాస్టల్ లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని సరిపడా హాస్టల్ భవనం ఉన్నా 24 మంది విద్యార్థులు హాజరు కావడం విచారకరమన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచి పేద విద్యార్థుల కు ప్రయోజనం చేకూరెలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయా హాస్టల్ ల వార్డెన్ లతో ఫోన్ లో మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులతో మాట్లాడి పలు వివరాలను తెలుసుకున్నారు.తమ పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు హాస్టల్ లను సందర్శించమని తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి విద్యార్థుల కు ప్రయోజనం చేకూరెలా కృషి చేస్తామన్నారు.

